క్లుప్తంగా

2న హాకీ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): మార్చి 2వ తేదీన స్థానిక ఎస్పీజీ క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లాల సీనియర్ మహిళల హాకీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ చాణిక్యరాజు, ఉమ్మడి జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి సుధీర్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు 2వ తేదీ మధ్యాహ్నం లోపు మైదానానికి చేరుకొని పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు, బర్త్ సర్టిఫికెట్‌తో పోటీల్లో పాల్గొనాలని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు 8 నుంచి 11వ తేదీ వరకు ప్రకాశం జిల్లాలో జరిగే 14వ హాకీ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

కార్మికుల భద్రతే ధ్యేయం

నంద్యాల(సిటీ): మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల భద్రతే ధ్యేయమని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో 104 మంది పారిశుద్ధ్య, 64 మంది ఇంజినీరింగ్ కార్మికులకు పారిశుద్ధ్య కిట్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పట్టణ వాసుల ఆరోగ్య పరిరక్షణకు శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ తమ బాధ్యత అన్నారు. కమిషనర్ నిరంజన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి, వైస్ చైర్మన్ పాంషావలి, ఎంఈ రమణమూర్తి, డీఈఈ మధుకుమార్, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ

నంద్యాల సిటీ: పట్టణ శివారులోని కుందూ నది ఒడ్డున విశ్వ బ్రాహ్మణుల శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా బుధవారం భూమిపూజ చేశారు. ఎంపీ నిధుల నుంచి రూ.7లక్షలతో ప్రహరీ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు సూర్యప్రకాశాచారి, గురుప్రకాశాచారి మాట్లాడుతూ శ్మశాన వాటికకు 1.45 ఎకరాలను ఉత్తరాది శంకరాచారి విరాళంగా ఇచ్చారని చెప్పారు.

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు



రుద్రవరం పీహెచ్‌సీలో వసతులను పరిశీలిస్తున్న వెంకటరమణ

రుద్రవరం: విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని ఆర్.నాగులవరంలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ చేయలేదని ఆరోపణలు ఉన్నాయని ఎందుకు చేయలేదని మండిపడ్డారు. స్థానిక పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేసి, ల్యాబ్‌లో వసతులు, రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియోను విజయవంతం చేయాలని ఆదేశించారు. నోడల్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి ఉన్నారు.

హిందూ ధర్మం ప్రాచీనమైనది

నంద్యాల వ్యవసాయం: హిందూ ధర్మం ప్రాచీనమైనదని, ఆచార వ్యవహారాలు గొప్పవని హిందూ ప్రచార సమితి కార్యదర్శి స్వామి రాధామనోహర్‌జీ తెలిపారు. బుధవారం స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని వినాయక్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో హిందూ దేవాలయ పరిరక్షణ సమితి చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బసవరాజు, దుర్గా శక్తి సభ్యురాలు ఇందిరమ్మ, సంగా రమేష్, బద్రిశెట్టి రవికుమార్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి ఇద్దరికి గాయాలు

రుద్రవరం: మండలంలోని ఎల్లావత్తుల సమీపంలో మోటార్ సైకిల్ మీద నుంచి కిందపడి ఇద్దరు యువకులు గాయపడ్డారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు నల్లబండ బజారుకు చెందిన మౌలాలి,దుర్గా ప్రసాదు మోటార్ సైకిల్‌పై రుద్రవవరం వెళ్లి అహోబిలేశుడి పార్వేట ఉత్సవాలను తిలకించి స్వగ్రామానికి వెళ్తుండగా ఎల్లావత్తుల రైస్‌మిల్ వద్ద ప్రమాదవశాత్తు అదుపు తప్పడంతో కింద పడ్డారు. గ్రామస్తులు వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

భక్తి శ్రద్ధలతో సంకటహర చతుర్థి

నంద్యాల వ్యవసాయం: పట్టణంలోని పలు దేవాలయాల్లో వెలసిన వినాయకుడికి సంకటహర చతుర్థిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగులకుంట నాగలింగేశ్వర ఆలయం, పార్కు రోడ్డులోని లక్ష్మిగణపతి, చెరువుకట్ట వద్ద ఉన్న వినాయక ఘాట్‌లో స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, క్షీరాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.అనంతరం గరికతో స్వామికి అష్టోత్తర నామావలి చేపట్టి, వినాయక వ్రతం, విఘ్నేశ్వర హోమం జరిపించి, మహామంగళ హారతులిచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

యుద్ధానికి సిద్ధం



- సీఎం వైఎస్ జగన్ స్పీచ్‌తో ఫుల్ జోష్‌లో వైఎస్సార్ సీపీ శ్రేణులు
- ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తాం
- పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం
- జగనన్న సైనికుల్లా పనిచేస్తామని ప్రతిన

సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సన్నద్ధమయ్యాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దిశా నిర్దేశంతో యుద్ధానికి సిద్ధమంటూ నినదిస్తున్నారు. అధినేత సూచించన లక్ష్యం దిశగా పయనిస్తున్నారు. 2019 ఎన్నికలకు మించి అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమాగా చెబుతున్నారు. మంగళగిరిలో ఇటీవల నిర్వహించిన మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం సమావేశంలో ఎన్నికల్లో అవలబించాల్సిన విధానాలపై పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి జగన్ దిశా నిర్దేశం చేశారు. 2019లో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చామని, ఇదే విషయాన్ని ప్రతీ ఇంటికి వెళ్లి తెలియజేయాల్సిన బాధ్యతను పార్టీ నాయకులకు అప్పగించారు. జగన్ దిశానిర్దేశంతో ఈ 45 రోజులు ఎన్నికల కదనరంగంలో నూతనోత్తేజంతో ముందుకు సాగుతామని వారంతా ముక్తకంఠంతో నినదిస్తున్నారు.

– సాక్షి, నంద్యాల

జగనన్న స్పీచ్‌తో నూతనోత్తేజం



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రసంగాలతో ప్రజల్లో నూతనుత్తేజం వచ్చింది. జగనన్న చేసిన మేలును ప్రతిఒక్కరూ అర్థం చేసుకుంటున్నారు. మీకు లబ్ధి చేకూరింది అని నమ్మితేనే ఓటు వేయండని అడిగిన నాయకుడు ఇప్పటి వరకు ఎవరూ లేరు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుంది. అదే విషయాన్ని ప్రజలకు చెప్పి ఓటేయాలని కోరుతాం.

– డి. అమీర్‌బాషా, జేసీఎస్ కన్వీనర్, నంద్యాల

జగనన్న సైనికుడిలా పనిచేస్తా



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మేలును ప్రతి గడపకు వెళ్లి తెలియజేస్తాం. అమ్మ ఒడి, నాడు నేడు, గోరు ముద్ద, సచివాలయ, వలంటీర్ వ్యవస్థల వల్ల సంక్షేమ ఫలాలు రాజకీయాలకు తావులేకుండా అందుతున్న విధానాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తాం. మరోసారి జగనన్నను గెలిపించుకునేందుకు సైనికుడిలా పని చేస్తా.

– సన్నాల సాయిరాం, జేసీఎస్ పట్టణ అధ్యక్షుడు, నంద్యాల

2019 సీన్ రిపీట్ అవుతుంది



2019లో నంద్యాల జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానాన్ని క్లీన్ స్వీప్ చేశాం. వచ్చే ఎన్నికల్లోనూ అదే సీన్ రిపీట్ అవుతుంది. పార్టీ గెలుపు కోసం ఈ 45 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పార్టీ గెలుపుకోసం ప్రయత్నిస్తాం.

– పీబీ శశికళ రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, నంద్యాల

వ్యాపారి ఇంట్లో చోరీ



విచారణ చేస్తున్న పోలీసులు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణానికి చెందిన వ్యాపారి గుండా వెంకటేశ్వర్లు ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. వన్‌టౌన్ సీఐ చలపతి తెలిపిన వివరాల మేరకు.. స్థానిక బాలాజీ కాంప్లెక్స్ వీధిలో నివాసముంటున్న వెంకటేశ్వర్లు ఈనెల 22న కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రలకు వెళ్లాడు. బుధవారం యాత్ర ముగించుకుని ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించాడు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారమివ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంను రప్పించారు. ఇంట్లోని బీరువాలో దాచిన 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదు, కిలో వెండి అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఫిర్యాదులను పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వివిధ అంశాలపై రాజకీయ పార్టీలు ఇచ్చిన ఫిర్యాదులను ఎన్నికల కమిషన్‌కు పంపామని, త్వరలోనే పరిష్కరిస్తామని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం జేసీ చాంబర్‌లో ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, రాజకీయ పార్టీల ఫిర్యాదులు తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇందులో వైఎస్సార్‌సీపీ నాయకులు అమృతరాజు, సాయిరాంరెడ్డి, కాంగ్రెస్ నుంచి సయ్యద్ రియాజ్ బాషా, టీడీపీ నుంచి శివరాం కుమార్, ప్రసాద్‌రెడ్డి, బీజేపీ తరఫున చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాలకు ఎస్వీఆర్, ఆర్జీఎం ఇంజినీరింగ్ కాలేజీలను ఎంపిక చేశామని, ఆమోదం కోసం ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు. ఎన్నికల కమిషన్ నిర్ణయించిన కాలేజీలోనే ఓట్ల లెక్కింపు కేంద్రాలను వినియోగిస్తామన్నారు. జిల్లాకు 86వేల ఓటరు గుర్తింపు కార్డులు వచ్చాయని, మార్చి 7వ తేదీలోపు ఓటర్లకు పంపిణీ చేస్తామని చెప్పారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఉయ్యాలవాడలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ షర్ఫుద్దీన్

ఉయ్యాలవాడ : పోలింగ్ కేంద్రాల్లో వసతులపై పరిశీలిస్తున్నామని ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ తెలిపారు. బుధవారం మండలంలోని ఇంజేడు, ఉయ్యాలవాడ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మకమైన గ్రామాలను గుర్తించామని చెప్పారు. పోలింగ్ రోజు ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందస్తుగా పోలింగ్ కేంద్రాల వద్ద గతంలో జరిగిన సంఘటనలపై తమ సిబ్బంది ద్వారా ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు. ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

దొర్నిపాడు: రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎస్పీ షర్ఫుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లె, డబ్ల్యూ గోవిందిన్నె, చాకరాజువేముల, దొర్నిపాడు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సమస్యత్మాక గ్రామాల్లో ముందుస్తు చర్యగా గ్రామస్తులకు ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉయ్యాలవాడ ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి, ఏఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

అభివృద్ధిలో నంద్యాల ముందంజ



మున్సిపల్ డ్రైవర్లకు వాహనాల తాళాలను అందిస్తున్న చైర్మన్

నంద్యాల(సిటీ): అభివృద్ధిలో నంద్యాల పట్టణం ముందంజంలో ఉందని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రూ.1.12 కోట్ల విలువైన రెండు కాంపాక్టర్లు, ఒక గల్పర్‌ను మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డితో కలిసి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలో వెలువడుతున్న రోజువారీ చెత్తను త్వరగా తరలించేందుకు ఈ యంత్రాలు ఉపయోగపడతాయన్నారు. రానున్న కాలంలో వాహనాలతో మరింత సులువుగా చెత్తను తరలించి కార్మికుల వ్యయ ప్రయాసలను తగ్గిస్తామని చెప్పారు. వైస్ చైర్మన్ పాంషావలి, అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి, ఎంఈఈ రమణమూర్తి, డీఈఈ మధుకుమార్, శానిటరీ సూపర్ వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిహారం విడుదల

నంద్యాల(సెంట్రల్): భారీ వర్షాలకు మట్టిమిద్దె కూలి మరణించిన మహిళ కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం విడుదల చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలు.. 2017 ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు బండిఆత్మకూరుకు చెందిన జూటూరు వెంకటమ్మ మృతి చెందింది. ఘటనపై విచారించిన అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ రాష్ట్ర విపత్తు ఉపశమన నిధి కింద మృతురాలి వారసులకు పరిహారం చెల్లించాల్సిందిగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే నాటి టీడీపీ ప్రభుత్వం పరిహారం గురించి పట్టించుకోలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మృతురాలి కుమారుడైన జూటూరు నాగన్నకు రూ.4 లక్షల పరిహారం అందజేయాలని నంద్యాల జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తూ బడ్జెట్ విడుదల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు సమర్థవంతంగా నిర్వహించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్ కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేసి సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయించాలన్నారు. జీవో నంబరు 12, 14ను విడుదల చేసి భవన నిర్మాణ కార్మికులకు పని లేకుండా చేయడం తగదన్నారు. తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల్లోని కార్మికులకు బోర్డు ద్వారా అందజేస్తున్న పథకాలను ఇక్కడ కూడా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం లేబర్ అధికారి కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు మహబూబ్‌బాషా, అంజి, వెంకటేశ్వర్లు, వరమయ్య పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న నంద్యాల ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి

మహానంది: అన్నిశాఖల అధికారుల సమన్వయంతో మహానందిలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని, భక్తుల మన్ననలు పొందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని నంద్యాల రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మల్లికార్జునరెడ్డి కోరారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందిలోని పోచా బ్రహ్మానందరెడ్డి డార్మెటరీ భవనంలో ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అన్ని శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆర్‌డీఓ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. హోటళ్లు, దుకాణదారులు భక్తులకు నాణ్యమైన తినుబండారాలు అందివ్వాలని, ఇష్టమొచ్చినట్లు ధరలు వసూలు చేస్తే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని 8, 9, 10వ తేదీల్లో మద్యం దుకాణాలు మూసివేయించాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు.

ప్రతి భక్తుడికి మహాలింగోద్భవం దర్శనం

మహానందికి వచ్చే ప్రతి భక్తుడికి మహాశివరాత్రి రోజున మహాలింగోద్భవ కాలంలో మహానందీశ్వర స్వామి దర్శనం కల్పిస్తామని ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గతేడాది లాగే ఈ ఏడాది లింగోద్భవం పూజలు జరుగుతున్నప్పుడు భక్తులకు దర్శనాలకు అనుమతిస్తామన్నారు. కార్యక్రమాల్లో నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంఏహెచ్‌ఓ డాక్టర్ అంకిరెడ్డి, సీఐ శివకుమార్‌రెడ్డి, ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



ప్రభుత్వ బాలికల పాఠశాలలో ప్రాజెక్టులను చూపుతున్న విద్యార్థినులు



చాగలమర్రి కేజీబీవీలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలి



సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఈఓ సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు

చాగలమర్రి: ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను వినియోగించుకొని విద్యార్థులు సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా సూచించారు. బుధవారం స్థానిక కేజీబీవీలో ప్రిన్సిపాల్ సునీత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజ్ఞాన సదస్సులో జిల్లా దీక్షా కో-ఆర్డినేటర్ నాగేంద్రకుమార్‌తో పాటు స్థానిక ఎంఈఓలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన జీవిత విశేషాలపై విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. అలాగే సైన్స్ మోడల్స్‌ను ప్రదర్శించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం జీవయ్య పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): సైన్స్ దినోత్సవాన్ని బుధవారం పట్టణంలో పలు విద్యాసంస్థల్లో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పద్మావతి ఆధ్వర్యంలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థినులు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ప్రతిభ చాటిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. సైన్స్ జిల్లా కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో చాపిరేవుల పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ , చిత్రలేఖనం, సైన్స్ ప్రయోగాల ప్రదర్శన నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లతో పాటు బహుమతులను అందజేశారు. లక్ష్మిదేవి, రమణమ్మ, ప్రమీల, రమాదేవి, రఫీ, సుధాకర్, చంద్రమోహన్, శ్రీవాణి, వీరన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శశికళ సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. అధ్యాపకులు మోహన్‌రెడ్డి, రమేష్‌కుమార్, రామాంజనేయులతో కలిసి రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. క్విజ్ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. అలాగే శ్రీచైతన్య పాఠశాలలో వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టుల నమూనాను తయారు చేశారు. ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి విజేతలను అభినందించారు. ఏజీఎం సురేష్, సౌజన్య, చౌదరి పాల్గొన్నారు.

గోస్పాడు మండలంలో..

యాళ్లూరు హైస్కూల్, గోస్పాడు మోడల్ స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలలో బుధవారం విద్యార్థుల ఆధ్వర్యంలో పలు రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఖాజాహుసేన్, హెచ్‌ఎం నాగేంద్ర మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుంచే సైన్స్ పట్ల అవగాహన పెంచుకొని పరిశోధనలపై మక్కువ చూపాలన్నారు. భౌతిక శాస్త్రంలో సీవీరామన్ అపారమైన సేవలకు గుర్తుగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తారని, సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు.

శిరివెళ్ల: జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా మోడల్ స్కూల్‌లో విద్యార్థులు వివిధ విజ్ఞాన ప్రదర్శనలు చేపట్టారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్లను సన్మానించారు. యర్రగుంట్ల డిగ్రీ కళాశాలలో సర్ సీవీ రామన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లుర్పించారు. ప్రతి విద్యార్థి శాస్త్రవేత్త స్థాయికి ఎదగాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. హెచ్‌ఎంలు విజయకుమార్, షఫత్ బేగం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : సీవీ రామన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు మహబూబ్‌షరీఫ్ సూచించారు. బుధవారం మండలంలోని మాయలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి నివాళులర్పించారు.



మోడల్ స్కూల్‌లో విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శన



యాళ్లూరు జెడ్పీహైస్కూల్‌లో ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ఆళ్లగడ్డ: ప్రస్తుతం సాంకేతిక రంగం దూసుకపోతుందని విద్యార్థులకు సైన్స్ పరిజ్ఞానం ఎంతో అవసరం అని డీఈఓ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నేషనల్ సైన్స్‌డేను పురష్కరించుకొని స్థానిక వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఈఓ శోభావివేకవతి, హెచ్‌ఎం వీరరాఘవయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాస్టళ్లకు నాడు-నేడు వర్తింపజేయాలి



మాట్లాడుతున్న జాన్సన్ బాబు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ హాస్టళ్లకు నాడు-నేడు కార్యక్రమం వర్తింపజేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కాస్మోటిక్ బిల్లులు ఇవ్వాలని, హాస్టళ్లలో సదుపాయాల సమస్యలను పరిష్కరించాలని, శిథిలావస్థలో ఉన్న వాటికి మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఖాళీగా ఉన్న వార్డెన్, వంట మాస్టర్, అటెండర్, ట్యూటర్, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ధనుంజయుడు, ప్రతాప్, ఉదయ్, ఎర్రిస్వామి, మహానంది పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా ఆధ్వర్యంలో గురువారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ నిరంజన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పలు అభివద్ధి కార్యక్రమాలపై సమావేశంలో చర్చ జరగనుందన్నారు. కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

ప్రొక్లెయిన్‌కు నిప్పు



తగలబడుతున్న ప్రొక్లెయిన్

దొర్నిపాడు: చాకరాజువేముల- డబ్ల్యూ. కొత్తపల్లె గ్రామాల మధ్య జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు ముగిసిన తరువాత నిలిపి ఉన్న ప్రొక్లెయిన్‌కు గుర్తుతెలియని దుండగులు బుధవారం రాత్రి నిప్పు పెట్టారు. ప్రస్తుతం రూ. 2 కోట్లతో నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు పనులు జరుగుతున్నాయి. పనులు ముగిసిన అనంతరం వర్కర్లు భోజనానికి వెళ్లగా నిప్పు పెట్టినట్లు తెలుస్తుంది. ఈ మేరకు దొర్నిపాడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కాంట్రాక్టర్ శివరామిరెడ్డి తెలిపారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ షర్ఫుద్దీన్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

5 నుంచి శింగవరంలో ప్రతిష్ఠోత్సవాలు

మహానంది: బండిఆత్మకూరు మండలం శింగవరం గ్రామంలో మార్చి 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు శ్రీ విఘ్నేశ్వర, ఈశ్వర, వెంకటేశ్వర, ఆంజనేయస్వామి, నాగ, ధ్వజ ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా సేద్యపు ఎద్దుల విభాగం (ఉమ్మడి జిల్లాలు)లో బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు.